బుధవారం 26-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 376, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## మంత్రులు ఆదాయ పన్ను చెల్లించాలి

### మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం



ముందడుగు మధ్యప్రదేశ్:

రాష్ట్రంలోని మంత్రులు ఇకపై సొంతంగా ఆదాయపు పన్ను చెల్లించాల్సిందేనని మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఆ భారాన్ని భరిస్తూ వస్తోంది. 1972 నుంచి ఈ నిబంధన అమల్లో ఉంది. మంత్రులకు చెల్లించే జీతం, ఇతర భత్యాలపై రాష్ట్ర ప్రభుత్వమే వారి తరఫున ఆదాయపు పన్ను చెల్లిస్తోంది. ఈ నేపపథ్యంలో దాదాపు 52 ఏళ్ల తర్వాత ఈ నిబంధనకు కేబినెట్ చరమగీతం పాడింది. కేబినెట్ సమావేశంలో మంత్రి కైలాష్ విజయ వర్గీయ ఈ అంశాన్ని లేవనెత్తగా.. మంత్రులు సొంతంగానే ఆదాయపు పన్ను చెల్లించాలని సీఎం మోహన్ యాదవ్ సూచించారు. మిగతా 2లో



## కబాబ్స్‌లో కృత్రిమ రంగులు నిషేధం

### వాటి వల్ల ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం ▪ నిషేధం విధించిన కర్ణాటక ప్రభుత్వం

ముందడుగు బెంగుళూరు:

వెజ్-నాన్ వెజ్ కబాబ్స్‌లో కృత్రిమ రంగులు కలపడం వల్ల ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని తెలుపుతూ పిల్లలు, పెద్దలు ఇష్టంగా తినే స్ట్రీట్ ఫుడ్స్‌లో కలర్స్‌పై కర్ణాటక ప్రభుత్వం నిషేధం విధించింది. రాష్ట్రవ్యాప్తంగా అమ్ముడవుతున్న కబాబ్‌లలో కృత్రిమ రంగులు ఉపయోగిస్తున్నారని, దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందని ఇటీవల మీడియా కథనాలు వెలువడడంతో ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ రంగంలోకి దిగింది. రాష్ట్రవ్యాప్తంగా విక్రయించే కబాబ్‌ల నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించింది. ఇవి నాసిరకంగా ఉన్నాయని గుర్తించిన అధికారులు కృత్రిమ రంగులపై నిషేధం విధించారు. 'ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం కృత్రిమ రంగులపై నిషేధం విధించామని, దీనిని అతిక్రమిస్తే జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తామని అధికారులు వెల్లడించారు. గతంలో రాష్ట్రంలో అమ్ముతున్న కాటన్ క్యాండీ(పీచు మిఠాయి)లో కలిపే కృత్రిమ రంగుల్లో పేపర్ ప్రింటింగ్‌లో ఎక్కువగా వినియోగించే రోడమైన్-బి అనే కెమికల్‌ను కలుపుతున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఇది ఎక్కువ మొత్తంలో మన శరీరంలోకి వెళ్తే.. కిడ్నీ, లివర్ పనితీరుపై ప్రభావం చూపుతుందని, అల్సర్ వంటి సమస్యలతో పాటు క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదముందని ఆరోగ్య నిపుణులు వెల్లడించారు. దీంతో మార్చిలోనే పీచు మిఠాయిపై రాష్ట్రవ్యాప్తంగా నిషేధం విధించారు.



## మధుమేహ వ్యాధిగ్రస్తులు ఇది చెయ్యండి

వివరాలు 3లో




## ఏ టెక్నాలజీ వచ్చినా ఈ ఉద్యోగాలు పదిలం

వివరాలు 3లో



## ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఏముంది?

వివరాలు 4లో



## రెండేళ్లు ఆగాల్సిందే..!

వివరాలు 5లో

## తమిళ ఎంపీ తెలుగులో ప్రమాణం

### చివర్లో జై తమిళనాడు అని ముగింపు



ముందడుగు ఢిల్లీ:

లోక్ సభలో వివిధ రాష్ట్రాల ఎంపీల ప్రమాణం జరుగుతోంది. తమ తమ రాష్ట్రాల భాషల్లో ఎంపీలు ప్రమాణం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువగా తెలుగులో మిగతా 2లో



## ఒంటెపై పార్లమెంట్‌కు ఎంపీ అభ్యర్థి

### పార్లమెంట్ పరిసరాల్లోకి రాగానే అడ్డుకున్న సిబ్బంది

ముందడుగు ఢిల్లీ:

లోక్ సభ ప్రమాణస్వీకార సమయంలో విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఢిల్లీలోని తన నివాసం నుంచి సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ తరహాలోనే రాజస్థాన్‌కు చెందిన భారత్ ఆదివాసీ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ రాజ్‌కుమార్ రోత్ ప్రమాణస్వీకారానికి ఒంటెపై పార్లమెంట్‌కు వచ్చారు. పార్లమెంట్ పరిసరాల్లోకి రాగానే ఆయన్ని మిగతా 2లో

ముందడుగు
బుధవారం, 26-6-2024, హైదరాబాద్

# మంత్రులు ఆదాయ పన్ను చెల్లించాలి

మొదటిపేజీ తరువాయి

ఇందుకు కేబినెట్‌లో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. మధ్యప్రదేశ్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంత్రులు, అధికారులు సొంతంగానే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అస్సాంలోని హిమంత బిశ్వశర్మ సర్కారు నిర్ణయం తీసుకున్న కొద్ది రోజులకే మధ్యప్రదేశ్ సర్కారు నుంచి ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం.

# తమిళ ఎంపీ తెలుగులో ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

చేశారు. తమిళనాడు ఎంపీలు తమిళంలో చేశారు. కానీ తమిళనాడులోని కృష్ణగిరి కాంగ్రెస్ ఎంపీ కె.గోపినాథ్ మాత్రం తెలుగులో ప్రమాణం చేశారు. తమిళనాడులోని కృష్ణగిరి లోక్ సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ ఎంపీ కె. గోపినాథ్ లోక్ సభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ సభ్యులంతా రాజ్యాంగ ప్రతిని చేతితో పట్టుకుని ప్రమాణం చేస్తున్నారు. ఆయన కూడా రాజ్యాంగ ప్రతిని ఓ చేత్తో పట్టుకుని తెలుగులో ప్రమాణం చేశారు. చివర్లో 'జై తమిళనాడు' అని ముగించారు.

# ఒంటెపై పార్లమెంట్‌కు ఎంపీ అభ్యర్థి

## పార్లమెంట్ పరిసరాల్లోకి రాగానే అడ్డుకున్న సిబ్బంది

మొదటిపేజీ తరువాయి

అక్కడున్న భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఒంటెను ఇంతకంటే ముందుకు అనుమతించడం కుదరదని చెప్పారు. సిబ్బంది తీరుపై ఎంపీ అసహనం వ్యక్తంచేశారు. గతంలో మూడుసార్లు ప్రధానిగా చేసిన వాజ్‌పేయీ ఎద్దుల బండిలో పార్లమెంట్‌కు వస్తే తప్పలేదు కానీ, నేను ఒంటెపై వస్తే తప్పేంటి? అని నిలదీశారు. దీనిపై పార్లమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. కాంగ్రెస్ మద్దతుతో బాన్స్‌వారా లోక్‌సభ స్థానం నుంచి ఈయన విజయం సాధించారు. సోమవారం ప్రారంభమైన ప్రమాణస్వీకార కార్యక్రమం ఇవాళ్టితో ముగియనుంది. బుధవారం స్పీకర్ పదవి కోసం ఎన్నిక నిర్వహించనున్నారు.

# మోసాలపై అవగాహనకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్యక్రమం

HDFC BANK
We understand your world

ముందడుగు హైదరాబాద్: సురక్షిత బ్యాంకింగ్ అవగాహనలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ఉద్యోగుల కోసం వర్చువల్ ఫ్రాడ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం వివిధ రకాల మోసపూరిత పద్ధతులపై అవగాహన కల్పించడం, అటువంటి వ్యూహాలపై మరింత అవగాహన కలిగి ఉండటానికి సమాచారాన్ని, నైపుణ్యాలతో ఉద్యోగులను మరింత సన్నద్ధం చేసే లక్ష్యాన్ని కలిగి ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, గ్రూప్ హెడ్ - రిటైల్ క్రెడిట్ స్ట్రాటజీ & కంట్రోల్, సుందరేశన్ ఎం, మిస్టర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, క్రెడిట్ ఇంటెలిజెన్స్ అండ్ కంట్రోల్ మనీష్ అగర్వాల్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి, దీనిని మరింత వివరించేందుకు కేస్ స్టడీస్‌ను తెలిపారు. కొరియర్ స్కామ్, ఫేక్ పోలీస్ స్కామ్, ఫేక్ క్రెడిట్ స్కామ్ వంటి కొత్త రకాల మోసాలపై సిబ్బందికి అవగాహన కల్పించడంపై సెషన్ దృష్టి సారించింది. మోసపూరిత ఖాతాలను తెరవకుండా ఎలా నివారించాలి, మనీ మ్యూల్(లు), తీవ్రవాద నిధులు, సైబర్ మోసాలు మరియు మనీ లాండరింగ్ కార్యకలాపాల కోసం బ్యాంకింగ్ ఛానెళ్ల దుర్వినియోగాన్ని నిరోధించడం వంటి అంశాలను కూడా అన్నీ చట్టపరమైన మరియు ప్రతిష్టాత్మక పరిణామాలతో కవర్ చేశారు.

# యువరాజ్ సింగ్ ఫౌండేషన్‌తో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్

ముందడుగు హైదరాబాద్: భారతదేశంలో సముదాయ సంక్షేమానికి ఒక దశాబ్దం పాటు ఆవిష్కరణలను, సహకారాన్ని అందించిన సందర్భంలో, ప్రపంచ సాంకేతిక నాయకునిగా కొనసాగుతున్న షవోమీ ఇండియా, క్రికెటర్, క్యాన్సర్ నుంచి బయటపడిన యువరాజ్ సింగ్ నెలకొల్పిన లాభాపేక్షలేని సంస్థ యువరాజ్ సింగ్ ఫౌండేషన్ తో సరికొత్త భాగస్వామ్యాన్ని ప్రకటించింది. 'స్వస్త్ మహిళా స్వస్త్ భారత్' ప్రాజెక్ట్‌లో భాగంగా15 రాష్ట్రాలలో 12 నెలల పాటు 1,50,000 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్‌ను పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తక్కువ ప్రాతినిధ్యం, తక్కువ వనరులు ఉన్న సంఘాలపై ఈ ప్రాజెక్టు దృష్టి సారించింది. ఎక్కువ ప్రభావం, చేరికకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటే షవోమీ చేపట్టిన ఈ ప్రయత్నం భారతదేశంలో ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలలో అత్యంత ఉన్నతమైనది.




షవోమీ ఇండియా అధ్యక్షుడు మురళీకృష్ణన్ బి మాట్లాడుతూ, "భారతదేశంలో మా దశాబ్ద కాలపు ప్రయాణంలో, అర్థవంతమైన సామాజిక మార్పు కోసం మా విస్తృతమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం ద్వారా మేము టెక్నాలజీ బ్రాండ్‌గానే కాకుండా అభివృద్ధి చెందాము. స్క్రీనింగ్ లేకపోవడంతో 70% కేసులను అధునాతన దశల్లో నిర్ధారణ చేయడంతో, భారతదేశంలో ప్రతి 6 నిమిషాలకు రొమ్ము క్యాన్సర్‌తో ఒక మహిళ చనిపోవడం అనేది కఠోర వాస్తవం. ఈ సమస్యను అధిగమించే దిశలో మేము యువరాజ్ సింగ్ ఫౌండేషన్ తో చేతులు కలపడానికి గర్విస్తున్నామని తెలిపారు.

# స్ప్రైట్ ఆగ్రో లిమిటెడ్ రూ.44.87 కోట్ల రైట్స్ జూన్ 24 నుంచి ప్రారంభం

SPRIGHT
AGRO LIMITED

ముందడుగు హైదరాబాద్: అగ్రికల్చర్, కాంటాక్ట్ ఫార్మింగ్, గ్రీన్హౌస్ టెక్నాలజీ వ్యాపారంలో నిమగ్నమైన అహ్మదాబాద్కు చెందిన స్ప్రైట్ ఆగ్రో లిమిటెడ్ (బీఎస్‌ఈ – 531205) రూ.44.87 కోట్ల రైట్స్ ఇష్యూ జూన్ 24, 2024న సబ్స్క్రిప్షన్ కోసం తెరవనుంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలతో సహా కంపెనీ విస్తరణ ప్రణాళికలకు నిధులు సమకూరుస్తాయి. 21 జూన్ 2024న ముగింపు షేరు ధర రూ.45.69తో పోలిస్తే కంపెనీ రైట్ ఇష్యూను రూ.13.4కు అందిస్తోంది. రైట్స్ ఇష్యూ 2024 జూలై 12న ముగుస్తుంది. రూ.1 ముఖ విలువ కలిగిన 3,34,84,611 పూర్తి పెయిడ్-అప్ ఈక్విటీ షేర్లను ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.13.4 (ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.12.4 ప్రీమియంతో కలిపి) రూ.44.87 కోట్ల చొప్పన నగదు రూపంలో జారీ చేయనుంది.ప్రతిపాదిత ఇష్యూ కోసం హక్కుల అర్హత నిష్పత్తి 1:15 గా నిర్ణయించబడింది (రికార్డు తేదీ - జూన్ 7, 2024 న ఈక్విటీ వాటాదారులు కలిగి ఉన్న ప్రతి 15 పూర్తి-చెల్లింపు ఈక్విటీ షేరుకు రూ. 1 ముఖ విలువ కలిగిన 1 రైట్స్ ఈక్విటీ షేర్లు). ఆన్-మార్కెట్ హక్కుల ఉపసంహరణకు చివరి తేదీ 8 జూలై 2024. ఇష్యూ ద్వారా వచ్చిన రూ.44.87 కోట్లలో రూ.34.15 కోట్లను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ.10.32 కోట్లను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని కంపెనీ భావిస్తోంది.



# సేవ పేరుతో పేద విద్యార్థుల దోపిడి

## హైదరాబాద్‌లో 11 చోట్ల ఈడీ సోదాలు

ముందడుగు జాతీయం: తెలంగాణలోని కొన్ని సంస్థలకు విదేశాల నుంచి వచ్చిన విరాళాలు పక్కదారి పట్టించిన వ్యవహారంలో సోదాలు జరిపిన ఈడీ.. ఆపరేషన్ మొబిలిటి(ఓమ్)పై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసింది. తెలంగాణ సీఐడీలో నమోదైన కేసు ఆధారంగా మరో కేసు నమోదు చేసిన ఈడీ అధికారులు మొత్తం 11 చోట్ల సోదాలు నిర్వహించారు. ఓమ్ సహా ఇతర సంస్థల పేరుతో విదేశాలకు చెందిన దాతల నుంచి రూ.300 కోట్లు సేకరించినట్లు ఈడీ పేర్కొంది. యూఎస్, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, డెన్మార్క్, జర్మనీ, బ్రెజిల్, ఫిన్‌లాండ్, ఐర్లాండ్, మలేసియా, రుమేనియా, సింగపూర్, నార్వే సహా పలు దేశాల నుంచి నిధులు సేకరించినట్టు తెలిపింది. తాము నిర్వహిస్తోన్న సుమారు 100 పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, అనాథ పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తామని ఈ విరాళాలు సేకరించినట్టు గుర్తించారు. విరాళాలను పక్కదారి పట్టించిన సదరు సంస్థ.. పాఠశాలల్లోని విద్యార్థుల వద్ద రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్టు సీఐడీ అధికారులు గతంలో గుర్తించారు. విరాళాల ద్వారా ఓమ్ సంస్థ తెలంగాణ, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రలో ఆస్తులు కొనుగోలు చేసినట్టు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో 11 చోట్ల రెండ్రోజుల పాటు సోదాలు చేసిన ఈడీ అధికారులు.. ఆస్తులకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, బినామీ కంపెనీల లావాదేవీల వివరాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ముందడుగు
బుధవారం, 26-6-2024, హైదరాబాద్

# దుబాయ్‌లో తెలుగు వ్యక్తికి వరించిన అదృష్టం

## రూ.2.25 కోట్లు లక్కీ డ్రా విజేత

ముందడుగు జాతీయం: ఉపాధి కోసం అరబ్ దేశం యూఏఈలోని దుబాయ్ వెళ్లిన ఓ తెలుగు వ్యక్తికి అదృష్టం వరించింది. నెల నెలా తాను చేసిన పొదుపుతో ఏకంగా రూ.2.25 కోట్లు గెలుచుకున్నారు. సేవింగ్స్ స్కీమ్ చందాదారులకు లక్కీ డ్రా నిర్వహించగా.. అందులో అతడు విజేతగా నిలిచారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బోరుగడ్డ నాగేంద్రమ్ 2017లో యూఏఈ వెళ్లారు. దుబాయ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఆయన 2019 నుంచి తాను సంపాదించిన దాంట్లో నుంచి ప్రతి నెలా 100 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హమ్స్‌ను నేషనల్ బాండ్స్‌లో పొదుపు చేశారు.




ఈ సేవింగ్ స్కీమ్ కట్టేవారికి రివార్డు ప్రోగ్రామ్ కింద లక్కీ డ్రా తీస్తారు.

గ్రాండ్ ప్రైజ్ కేటగిరీలో తీసిన లాటరీలో నాగేంద్రమ్ విజేతగా నిలిచారు. నగదు బహుమతి కింద 1 మిలియన్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హమ్స్ అందుకున్నారు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.2.25కోట్లకు పైమాటే. ఈ ప్రైజ్‌మనీపై ఆంధ్రా వాసి అంతులేని ఆనందం వ్యక్తం చేశారు. తన పిల్లల ఉన్నత చదువుల కల నెరవేరుతుందని, వారి భవిష్యత్తు భద్రంగా ఉంటుందని సంతోషపడ్డారు.

# బడ్జెట్ సన్నాహక సమావేశాలు షురూ

- వ్యవసాయానికి బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష
- మంత్రి తుమ్మలతో డిప్యూటీ సీఎం భట్టి హాజరు



ముందడుగు హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన వార్షిక బడ్జెట్ సన్నాహక సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు. పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశంలో ఆయన ప్రవేశపెట్టనున్నారు.

వ్యవసాయ రంగానికి కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి జిల్లా ల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, కళాశాలలే లేని జిల్లాల వివరాలపై వారు చర్చించారు. సీడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపైనా ఆరా తీశారు. వ్యవసాయ కళాశాలల్లో విత్తన అభివృద్ధి తీరుపైనా చర్చించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిలిపివేసిన వ్యవసాయ పథకాలేంటి? అందుకు గల కారణాలను డిప్యూటీ అడిగి తెలుసుకున్నారు.

సమావేశం లో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఆర్థిక శాఖ అడిషనల్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాసర్ పాల్గొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించేందుకు నీటిపారుదలశాఖ మంగళవారం జలసౌధలో సమావేశమైంది. వివిధ సర్కిళ్ల సీఈలు, వివిధ విభాగాల ఇన్‌చార్జులు సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులకు బడ్జెట్ ప్రతిపాదనల్లో అగ్రస్థానం కల్పించాలని నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు.




# మధుమేహ వ్యాధిగ్రస్తులు ఇది చెయ్యండి

- రోజు 45నిమిషాల నడక తప్పనిసరి
- స్వీట్లు, ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్ ఫుడ్ దూరం ఉండాలి

ముందడుగు ఆరోగ్యం: మనిషికి చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఎప్పుడు ఏ వ్యాధి వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత రోజుల్లో మధుమేహం అందరికి సోకుతోంది. ఈ వ్యాధిని అదుపులో ఉంచుకోవాలి. లేకపోతే, గుండె, మూత్రపిండాలు, కళ్ళు, నరాలు సహా శరీరంలోని అనేక అవయవాలు తీవ్రంగా దెబ్బతింటాయి. కాబట్టి బ్లడ్ షుగర్ అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించాలి. ఇక రక్తంలో గ్లూకోజ్ స్థాయిని అదుపులో ఉంచుకోవాలంటే ముందుగా స్వీట్లు, ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఫుడ్ తినడం మానేయాలి. దానితో పాటు, ప్రతిరోజూ తగినంత సమయం నడవడం ముఖ్యం. అప్పుడే చక్కెరతో ఆరోగ్యంగా జీవించవచ్చు. కానీ ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, రోజుకు ఎంత సమయం వాకింగ్ చేస్తే బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుంది? దీనికి సమాధానం తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే మీరు అనుకున్న ప్రయోజనాలు పొందగలుగుతారు.

### ఈ వ్యాయామం తప్పనిసరి

వాకింగ్ మధుమేహ రోగులకు రెండు విధాలుగా ప్రయోజనం చేకూరుస్తుంది. మొదటిది నడక అనేది శారీరక వ్యాయామం. కాబట్టి, ఈ వ్యాయామం చేయడం వల్ల అదనపు కేలరీలు ఖర్చవుతాయి. ఫలితంగా శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. రెండవది, వాకింగ్ శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. అందువల్ల, శరీరంలోని కణాలు రక్తంలో ఉన్న గ్లూకోజ్‌ను ఉపయోగించుకోవచ్చు. దీని కారణంగా చక్కెర స్థాయి తగ్గుతుంది. అందువల్ల మధుమేహ రోగులందరూ క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలని వైద్యులు చెబుతుంటారు.

### భోజనం తర్వాత వాకింగ్

40 ఏళ్లు వచ్చిన తర్వాత కండరాలు క్షీణించడం ప్రారంభిస్తాయి. ఇది చాలా సాధారణ శారీరక ప్రక్రియ. అయితే, డయాబెటిక్ రోగుల శరీరం కండరాలను కోల్పోయినప్పుడు, రక్తంలో చక్కెర స్థాయి చాలా పెరుగుతుంది. కాబట్టి ఆరోగ్యంగా ఉండాలంటే, ఈ వ్యాధితో బాధపడేవారు కండరాల బలాన్ని పెంచుకోవాలి. దీనికోసం వాకింగ్ కోసం రోజులో కొంత సమయం కేటాయించండి . మీరు దాని నుండి ప్రయోజనం పొందుతారు. బ్లడ్ షుగర్ అదుపులో ఉండాలంటే రోజులో కనీసం 45 నిమిషాల పాటు నడవాలి. స్టెప్పుల విషయానికొస్తే కనీసం 6 వేల అడుగులు నడవాలి అయితే రోజుకు 9 నుంచి 10 వేల అడుగులు నడవగలిగితే. అప్పుడు మీరు ఎక్కువ లాభం పొందుతారు. రోజులో మీరు వాకింగ్ సమయాన్ని 3 భాగాలుగా విభజించుకోవాలి. అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం తర్వాత 15 నిమిషాలు నడవడం మంచిది. ఇలా చేయడం వల్ల షుగర్‌ని సులభంగా నియంత్రించుకోవచ్చు. అలాగే ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది.

ముందడుగు

బుధవారం, 26-6-2024, హైదరాబాద్



# ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఏముంది?

- గోడదూకే ప్రజాప్రతినిధులపై అనర్హత వేటేసేలా రూల్స్
- 4 దశాబ్దాల కిందట తీసుకొచ్చిన రాజీవ్‌గాంధీ సర్కారు
- చట్టాన్ని మరింత బలోపేతం చేయడంలో కోర్టుల కృషి

ప్రజాస్వామ్య సమగ్రతను దెబ్బతీస్తూ, ఓటర్ల తీర్పును అపహాస్యం చేస్తూ ఒక పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలోకి దూకే 'ఆయారామ్.. గయారామ్'ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ పరిస్థితి రాజకీయ వ్యవస్థలో మరింత అస్థిరతను, గందరగోళాన్ని సృష్టిస్తున్నది. దీన్ని గమనించే రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1985లో 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని' తీసుకొచ్చింది. ఆ చట్టాన్ని మరింత బలోపేతం చేయడానికి తర్వాత వచ్చిన ప్రభుత్వాలు, న్యాయస్థానాలు తమ వంతు కృషి చేశాయి. - ముందడుగు ప్రత్యేకం

### ఏమిటీ ఫిరాయింపులు?

ఒక రాజకీయ పార్టీ టికెట్‌పై చట్టసభలకు ఎన్నికైన సభ్యులు స్వార్థప్రయోజనాలతో మరొక పార్టీలోకి మారడాన్నే 'పార్టీ ఫిరాయింపు'గా వ్యవహరిస్తారు. ఈ చర్యలను నియంత్రించడానికే 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని' తీసుకొచ్చారు.

### ఏమిటీ చట్టం? ఎవరు తీసుకొచ్చారు?

పార్టీ ఫిరాయింపులను నియంత్రించడమే లక్ష్యంగా 1985లో కేంద్రంలోని అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం.. 52వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పదో షెడ్యూల్‌ను చేర్చింది. ఆర్టికల్స్ 101, 102, 190, 191ల్లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి వివరించారు.

### చట్టంలోని కీలకాంశాలు

- ఒక రాజకీయ పార్టీ నుంచి గెలిచిన సభ్యుడు ఆ పార్టీ సభ్యత్వానికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే, ఆ వ్యక్తిని అనర్హుడిగా పరిగణించాలి.
- ఇండిపెండెంట్‌గా గెలిచి చట్టసభకు ఎన్నికైన సభ్యుడు తర్వాత ఏదైనా రాజకీయ పార్టీలోకి మారితే ఆ సభ్యుడిని అనర్హుడిగా ప్రకటించాలి.
- సొంత పార్టీ జారీచేసిన ఆదేశాలకు (విప్) విరుద్ధంగా సభ్యుడు ఓటేసినా లేదా ఆ సమయంలో సభకు హాజరుకాకపోయినా సదరు సభ్యుడిని అనర్హుడిగా పరిగణించాలి.
- సభకు నామినేట్ అయిన సభ్యుడు నామినేట్ అయిన తేదీ నుంచి ఆరు మాసాల తర్వాత మరేదైనా రాజకీయ పార్టీలో చేరినప్పుడు అనర్హతవేటు పడుతుంది.

### మినహాయింపులు ఇవి

- ఒక పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు వేరొక పార్టీలోకి మారినప్పుడు ఈ చట్టం ప్రభావం ఉండబోదు.
- ఒక రాజకీయ పార్టీ మరొక పార్టీలో విలీనమైనప్పుడు ఆ పార్టీకి చెందిన సభ్యులకు ఈ చట్టం వర్తించబోదు.
- చట్టసభల స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు తమ పార్టీ సభ్యత్వానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పటికీ ఈ చట్టం ప్రభావంతో వారిపై అనర్హత వేటు పడదు.

### అనర్హత వేటుపై నిర్ణయాధికారం ఎవరిదంటే?

- ఫిరాయింపునకు పాల్పడిన సభ్యుడిపై అనర్హత వేటు వేసే నిర్ణయాధికారం పూర్తిగా సభాధ్యక్షుడికే ఉంటుంది.
- పార్టీ ఫిరాయింపుతోపాటు, పార్టీలో చీలిక, పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటేయడం తదితర అంశాలు
- వివాదాస్పదమైనప్పుడూ దీనిపై నిర్ణయం తీసుకొనే అధికారం కూడా సభాధ్యక్షుడికే ఉంటుంది.
- న్యాయస్థానాల పరిధి ఏమేరకు ఉంటుందంటే?
- సహేతుక కారణాలు, ఎలాంటి ఆధారాలు లేకుండా సభాధ్యక్షుడు రాజకీయ పార్టీ విలీనానికి సమ్మతించినప్పుడు ఆ ప్రక్రియను న్యాయస్థానంలో సవాల్ చేయవచ్చు.
- చట్టానికి లోబడి సభ్యులపై చర్యలు తీసుకోవడంలో సభాధ్యక్షుడు విఫలమైనప్పుడు కోర్టును ఆశ్రయించవచ్చు.
- రాజకీయ పార్టీలు చేసే ఫిర్యాదులపై సభాధ్యక్షులు నిర్ణయం తీసుకోవడంలో ఉద్దేశపూర్వక జాప్యం చేసినప్పుడు న్యాయస్థానాలకు వెళ్లొచ్చు.

# ఏ టెక్నాలజీ వచ్చినా ఈ ఉద్యోగాలు పదిలం

## ఈ 10 రంగాల్లో ఉద్యోగాలు సురక్షితం ▪ మీరు చేసే ఈ ఉద్యోగాలకు పూర్తి భద్రత

ముందడుగు ప్రత్యేకం:

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నివేదిక ప్రకారం 2027 నాటికి భారత జాబ్ మార్కెట్ 22 శాతం మేర మారనుంది. అంటే ఇప్పటి వరకు జనాదరణ పొందిన ఉద్యోగాలు హఠాత్తుగా డిమాండ్ తగ్గుతాయి. మీరు ఎప్పడూ వినని ఉద్యోగాలు అకస్మాత్తుగా వెలుగులోకి వస్తాయి. అందువల్ల టెక్నాలజీతో పాటు మిమ్మల్ని మీరు అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన సమయం ఇది. మీ ఉద్యోగం సురక్షితంగా ఉండే 10 ప్రత్యేక రంగాల గురించి తెలుసుకోండి.




### 1- డేటా సైంటిస్ట్ -

పైథాన్, స్కాలా, ఆర్, జావా వంటి కంప్యూటర్ భాషలపై మీకు బలమైన పట్టు ఉంటే, ఈ కెరీర్ ఎంపిక మీకు ఉత్తమమైనది. ఇందులో సగటు జీతం రూ.14 లక్షల వరకు ఉంది.

2- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్- ఈ రంగంలో మీ స్థానాన్ని సంపాదించడానికి, కంప్యూటర్ భాషతో పాటు గణితం, అల్గారిథమ్‌లపై పరిజ్ఞానం కలిగి ఉండటం అవసరం. ఇందులో సగటు జీతం రూ.11 లక్షల వరకు ఉంటుంది.

### 3- హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ -

ఎన్నివైద్య పరికరాలను ప్రవేశపెట్టినా, ప్రస్తుతం డాక్టర్స్ ని ఎవరూ భర్తీ చేయలేరు. మెడిసిన్ మాత్రమే కాకుండా, ఆరోగ్య సంరక్షణ నిపుణులుగా అనేక ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి. వారి సగటు జీతం రూ.2.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంటుంది.

### 4- డిజిటల్ మార్కెటర్ -

సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్, సెర్చ్ ఇంజన్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, ఎడిటింగ్, డేటా అనలిటిక్స్, క్రియేటివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ ఉన్నవారు ఈ రంగంలో చోటు సంపాదించుకోవచ్చు. వీరి సగటు జీతం రూ.7 లక్షల వరకు ఉంది.

### 5- సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్-

ఈ ఫీల్డ్ కోసం ప్రోగ్రామింగ్, స్క్రిప్టింగ్ భాషలపై బలమైన పట్టు అవసరం. డేటా భద్రత, నెట్‌వర్కింగ్ ప్రోటోకాల్‌ల గురించి కూడా అవగాహన కలిగి ఉండాలి. వారి సగటు జీతం రూ.5.76 లక్షల వరకు ఉంది.

### 6- హ్యూమన్ రిసోర్స్ మేనేజర్-

హ్యూమన్ రిసోర్స్ అంటే హెచ్ఆర్‌లో కెరీర్ కి కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా బాగా ఉండాలి. మీరు వ్యాపారాన్ని ఎలా నిర్వహించాలో తెలుసుకోవాలి. నిర్ణయం తీసుకునే కళ కూడా ముఖ్యమైనది. వారి సగటు జీతం రూ.9,10,000 వరకు ఉంటుంది.

### 7- ఫుల్ స్టాక్ డెవలపర్-

HTML, CSS, Java స్క్రిప్ట్‌లపై బలమైన పట్టు ఉన్నవారు ఈ రంగంలో గొప్ప కెరీర్‌ని పొందవచ్చు. సర్వర్ సైడ్ ప్రోగ్రామింగ్ కూడా తెలుసుకోవాలి. వారి సగటు జీతం రూ.7,17,000 వరకు ఉంటుంది.

### 8- క్లౌడ్ డెవలపర్ -

ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌తో పాటు లైనక్స్, డెవలప్‌మెంట్, ఆపరేషనల్ స్కిల్స్‌పై కమాండ్ ఉన్నవారు క్లౌడ్ డెవలపర్‌లు కావచ్చు. NASSCOM ప్రకారం 2026 నాటికి ఈ రంగంలో 14 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించబడతాయి. వీరి సగటు జీతం రూ.11 లక్షల వరకు ఉంటుంది.

### 9- ప్రాజెక్ట్ మేనేజర్ -


మీకు నాయకత్వం, టీమ్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు ఉంటే ఈ కెరీర్ ఆప్షన్ ఉత్తమంగా ఉంటుంది. ఈ రంగంలో పనిచేస్తున్న వ్యక్తుల సగటు జీతం రూ.17 లక్షల వరకు ఉంటుంది.

### 10- డిజిటల్ కంటెంట్ క్రియేటర్-

సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాల ఆధారంగా మీరు గొప్ప డిజిటల్ కంటెంట్ సృష్టికర్త కావచ్చు. వారి సగటు జీతం రూ. 8,50,000 వరకు ఉంటుంది. ఇది బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ను బట్టి కూడా పెరగవచ్చు.

# వచ్చే ఐదు రోజులు మోస్తరు వర్షాలు

తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షా లు కురుస్తాయని తెలిపింది. బుధవారం నుంచి గురువారం వరకు నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ , వరంగల్ , హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, సంగారెడ్డి, మెదక్ , కామారెడ్డి జిల్లాలో



వర్షా లు పడుతాయని పేరొంది. గురువారం నుంచి శుక్రవారం వరకు ఆసిఫాబాద్ , మంచిర్యాల, భూపాలపల్లి, మేడ్చల్ మలాజ్‌గిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అకడకడా భారీ వర్షా లు పడుతాయని వివరించింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ క్రమంలో బంగాళాఖాతంలో ఈ నెల 26న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో 26న ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో , 27,28వ తేదీల్లో అనేక చోట్ల విస్తారంగా వర్షా లు కురుస్తాయని వెల్లడించారు. ఈ నెల మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఆ తర్వాత అత్యంత చురుకుగా కదిలి ఈ నెల 14 నాటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. ఈ నెలలో రాష్ట్రంలోని చాలా చోట్ల లోటు వర్షపాతం నమోదయ్యే పరిస్థితులే కనిపిస్తున్నట్టు తెలిపింది. జూన్ నెలలో ఇప్పటి వరకు 7.85 సెంమీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, మంగళవారం నాటికి 8.53 సెంమీ వర్షం కురిసింది. ఈ నెల చివరి వారంలో భారీ నుంచి అతి భారీ వర్షా లు నమోదు కావొచ్చని అంచనా వేస్తునప్పటికీ, తూర్పు ప్రాంత జిల్లాలోనే ఎక్కువగా అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

ముందడుగు
బుధవారం,
26-6-2024,
హైదరాబాద్

# రెండేళ్లు ఆగాల్సిందే..!




అగ్ర కథానాయిక రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఈ భామ అరడజనుకుపైగా సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. మరోవైపు పలువురు అగ్ర దర్శకనిర్మాతలు తమ సినిమాల్లో రష్మికనే కథానాయికగా తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రష్మిక మందన్న డేట్స్ కావాలంటే మరో రెండేళ్లు వేచి చూడాల్సిందేనని తెలుగు సినీ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.

తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో పలు ప్రతిష్ఠాత్మక చిత్రాలు రష్మిక చేతిలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తి కావడానికి రెండేళ్లు పడుతుందని, ఆ తర్వాతే కొత్త సినిమాలు అంగీకరించే పరిస్థితి ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప-2, కుబేర, గాళ్‌ఫ్రెండ్, రెయిన్‌బో చిత్రాల్లో నటిస్తున్నది.

మరోవైపు హిందీలో సల్మాన్‌ఖాన్-మురుగదాస్ కాంబోలో తెరకెక్కుతున్న చిత్రంలో ఆమెనే కథానాయికగా ఎంచుకున్నారు. మరోవైపు ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ చిత్రంలో రష్మికనే నాయికగా తీసుకున్నారని ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ 'పుష్ప-3' వెంటనే పట్టాలెక్కితే ఆ సినిమా కోసం కూడా కాల్షీట్స్ కేటాయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మరో రెండేళ్ల వరకు రష్మిక డేట్స్ కష్టమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# నేతాజీ మార్గంలో నేను..



కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భారతీయుడు-2'. శంకర్ దర్శకుడు. జూలై 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. సిద్ధార్థ్ చెప్పే డైలాగ్స్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. వ్యవస్థలోని అవినీతిని అరికట్టడానికి సేనాపతి తిరిగి రావాల్సిందేనని ప్రజలు భావిస్తుంటారు. ఈ నేపథ్యంలో సేనాపతి ఎంట్రీ ఇస్తాడు. సేనాపతిగా కమల్‌హాసన్ విభిన్న గెటప్స్‌లో కనిపించారు. యాక్షన్, విజువల్స్ హైలైట్‌గా నిలిచాయి. 'ఇది రెండో స్వాతంత్ర్య పోరాటం. గాంధీజీ మార్గంలో మీరు..నేతాజీ మార్గంలో నేను. ఇక ఆట ఆరంభమైంది' అంటూ సేనాపతి చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. సీక్వెల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ కనిపించనున్నారు. ఎస్.జె.సూర్య, సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీశంకర్, నెడుముడి వేణు, వివేక్, కాళిదాస్, జయరాం, గుల్షన్ గ్రోవర్, సముద్రఖని, బాబీ సింహా, బ్రహ్మానందం, జాకీర్ హుస్సేన్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమెరా: రవివర్మన్, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ ప్రొడక్షన్స్, నిర్మాత: సుభాస్కరన్.

# అధర్మాన్ని అణిచి వేయగా..

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898' చిత్రం ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం 'థీమ్ ఆఫ్ కల్కి' పేరుతో లిరికల్ వీడియోను విడుదల చేశారు. సంతోష్ నారాయణ్ స్వరపరచిన ఈ గీతాన్ని చంద్రబోస్ రచించారు. కాలభైరవ ఆలపించారు. 'కల్కి' చిత్ర సారాంశాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట అర్థవంతంగా సాగింది. ఇటీవల ఈ గీతాన్ని మధురలో ఆవిష్కరించారు. 'అధర్మాన్ని అణిచేయగా యుగయుగాన జగములోన పరిపరి విధాల్లోన విభవించే విక్రమ విరాట్ రూపమిదే.. స్వధర్మాన్ని పరిరక్షించగా.. సమస్తాన్ని ప్రక్షాళించగా..సముద్భవించే అవతారమిదే..' అంటూ ఈ పాట కృష్ణుడి శక్తియుక్తుల్ని ఆవిష్కరిస్తూ సాగింది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్, దిశాపటానీ కీలక పాత్రల్ని పోషించిన ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వనీదత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. వరల్డ్‌వైడ్‌గా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నది.

